సాక్షి పార్వతీపురం మన్యం

గురువారం । 14 । నవంబర్ । 2024

స్వర్ణాంధ్ర విజన్ లక్ష్యాలను శతశాతం సాధించాలి

• జేసీ సేతు మాధవన్



విజయనగరం అర్బన్: స్వర్ణాంధ్ర విజన్ లక్ష్యాలను శత శాతం సాధించాలని జేసీ సేతుమాధవన్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన తన చాంబర్‌లో వ్యవసాయ, అనుబంధశాఖల అధికారులతో 100 రోజుల ప్రణాళికల పురోగతి, వచ్చే వందరోజుల కార్యాచరణ ప్రణాళిక, ఏడాది, మూడేళ్ల, ఐదేళ్ల ప్రణాళికలపై సమీక్షించారు. నివేదికలలో కచ్చితంగా రాయాలని అధికారులకు సూచించారు. ప్రతి శాఖ వారి లక్ష్యాలను ఆన్‌లైన్‌లో పెట్టేటప్పుడు కలెక్టర్ ఆమోదం తప్పనిసరిగా పొందాలని సూచించారు. సమావేశంలో వ్యవసాయ, మత్స్య, పశు సంవర్ధక, ఉద్యాన, పట్టు శాఖల అధికారులు పాల్గొన్నారు.

15న విద్యార్థులకు క్రీడా పోటీలు

సీతంపేట: జనజాతీయ గౌరవ దివస్‌ను పురస్కరించుకుని విద్యార్థులకు ఈనెల 15న వివిధ క్రీడా పోటీలు నిర్వహించాలని ఐటీడీఏ పీఓ యశ్వంత్ కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమపాఠశాలలు, గురుకులాలు, కేజీబీవీల్లో చిత్రలేఖనం, వక్తృత్వ, వ్యాసరచన పోటీలు, ఆర్చరీ, జావలెన్‌త్రో, వాలీబాల్ విభాగాల్లో పోటీలు నిర్వహించాలని సూచించారు. క్లస్టర్ స్థాయిలో 15 వ తేదీన, 20న ఐటీడీఏ స్థాయిలోను నిర్వహించాలని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

నేడు జాతీయ లోక్‌అదాలత్



సమావేశంలో పాల్గొన్న న్యాయమూర్తులు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: ఇన్సూరెన్స్ కంపెనీలపై మోటారు బీమా కేసులకు సంబంధించి ఈ నెల 14న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్టు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కళ్యాణ్ చక్రవర్తి తెలిపారు. ఈ మేరకు కంపెనీ అధికారులతో బుధవారం సమావేశమయ్యారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి చాంబర్‌లో నిర్వహించే అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించాలన్నారు. సమావేశంలో న్యాయమూర్తులు కె.నాగమణి, పోక్సో కోర్టు జడ్జి, ఎస్సీఎస్టీ కోర్టు జడ్జి అప్పలస్వామి, మహిళా కోర్టు జడ్జి పద్మావతి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.వి.రాజేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంరక్షణ బాధ్యత ఉపాధ్యాయులదే..

• ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ

పార్వతీపురం: గిరిజన సంక్షేమ గురుకులం, ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థుల సంరక్షణ బాధ్యత సంబంధిత ఉపాధ్యాయులదేనని ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. స్థానిక గిరిమిత్ర సమావేశ మందిరంలో గిరిజన ప్రాంతాల్లోని ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల నిర్వహణపై ప్రధానోపాధ్యాయులు, వసతి గృహ సంక్షేమ అధికారులు, డిప్యూటీ వార్డెన్‌లతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ పాఠశాలలో ప్రతి ఉపాధ్యాయుడు 20 మంది విద్యార్థులను దత్తత తీసుకొని, విద్య, ఆరోగ్యం నడవడికపై దృష్టి సారించాలన్నారు. పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన ఆహారాన్ని మెనూ ప్రకారం అందించాలన్నారు. మరుగుదొడ్లు, స్నానాల గదులలో నిత్యం నీరు సరఫరా అయ్యేలా చూడాలన్నారు. సహాయ గిరిజన సంక్షేమ అధికారులు నెలలో కనీసం రెండు పాఠశాలల్లో రాత్రి బసచేసి సమస్యలు తెలుసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ సిబ్బంది, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పల్లె పండుగ పనులన్నీ ప్రారంభం కావాల్సిందే..



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం: పల్లె పండుగ కార్యక్రమం కింద జిల్లాలో చేపట్టిన పనులన్నీ ప్రారంభం కావాల్సిందేనని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ స్పష్టం చేశారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పల్లె పండుగ పనుల ప్రగతిపై ఈఈలు, డీఈఈలు, ఏఈఈలతో కలెక్టర్ బుధవారం సమీక్షించారు. సంక్రాంతి నాటికి పనులు పూర్తికావాలని ప్రభుత్వం నిర్దేశించిందని, జిల్లాలో డిసెంబర్ నెలాఖరు నాటికి అన్ని పనులు పూర్తికావాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా చేపట్టిన 521 పనుల్లో 386 పనులు ఇంతవరకు ప్రారంభం కాకపోవడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. వచ్చే వారంలోగా పనులన్నీ ప్రారంభించి, వచ్చే నెలలోగా పూర్తి కావాలన్నారు. పనుల ప్రగతిలో నిర్లక్ష్యం వహించిన కురుపాం, జియ్యమ్మవలస, పాచిపెంట, సాలూరు ఏఈఈలకు చార్జ్ మెమోలు జారీచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో రహదారులు లేని గ్రామాలు చాలా ఉన్నాయని, పల్లె పండుగ కింద రోడ్ల నిర్మాణంలో నిర్లక్ష్యం వహించడం పట్ల కలెక్టర్ మండిపడ్డారు. గుత్తేదారులతో పనులు చేయించాల్సిన బాధ్యత సంబంధిత ఇంజినీరింగ్ అధికారులదేనని ఉద్బోధించారు. పనిచేయని కాంట్రాక్టర్లను తొలగించి, కొత్త వారికి అవకాశం ఇవ్వాలన్నారు. రహదారులు, వంతెనలు, కల్వర్టులపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. రోడ్డు సౌకర్యం లేని 19 గిరిజన గ్రామాల్లో అంచనాలను రూపొందించి తక్షణమే పనులు ప్రారంభించాలని కలెక్టర్ తెలిపారు. మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.15వేలు మంజూరు చేస్తోందని, పల్లె ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. సమావేశంలో పంచాయతీ రాజ్, ఐటీడీఏల పరిధిలోని ఈఈలు, డీఈఈలు, ఏఈఈలు పాల్గొన్నారు.

ఆడాలి.. పాడాలి.. కల సాకారమవ్వాలి!

జీవిత పుస్తకంలో బాల్యమనేది రంగులద్దిన పుట. ఆకాశంలోని చంద్రుడు కావాలని తల్లిదండ్రుల ముందు మారాం చేసిన రాముడు.. అల్లరి, పెంకితనంతో బాల్యచేష్టలకు పరిపూర్ణ ఉదాహరణగా నిలిచిన కృష్ణుడు.. బాల్యంలోని మధుర స్మృతులను అనుభవించిన వారే. తల్లిదండ్రులకు ఆ మాధుర్యాన్ని పంచిన వారే. మనిషి జీవితంలోని కీలకమైన నాలుగు దశల్లో బాల్యం కుంటుపడితే.. మిగిలిన దశలు గాడి తప్పుతాయి. ఈ వయస్సులో ఆటపాటలు, చిలిపి పనులు ఎంత అవసరమో... అందమైన భవిష్యత్తుకు వేసే అడుగులూ అంతే కీలకమని చెబుతున్నారు మన జిల్లా అధికారులు. బాలల దినోత్సవం వేళ వారి బాల్య స్మృతులు, విజయగాథలు విందాం.

– సాక్షి, పార్వతీపురం మన్యం

- బాల్యం రంగులద్దిన పుట
- చిన్నతనంలో తీసుకున్న నిర్ణయాలే కీలకమన్న మన జిల్లా అధికారులు
- నేడు బాలల దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం

భవిష్యత్తుకు బాల్యమే పునాది

ప్రతి ఒక్కరి జీవితంలోనూ బాల్యం తీయని జ్ఞాపకం. దానిని ఆటపాటలతో ఆస్వాదిస్తూనే.. భవిష్యత్తును సుందరంగా మార్చుకునే పునాది వేసుకోవాలని చెబుతున్నారు మన కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్. బాలల దినోత్సవం సందర్భంగా జిల్లాలోని చిన్నారులకు శుభాకాంక్షలు తెలిపిన ఆయన.. తన బాల్యంలోని మధుర స్మృతులను చెబుతూనే, లక్ష్య సాధన కోసం ఆటుపోట్లను ఎదుర్కొని.. ఐఏఎస్ స్థాయికి చేరుకున్న తీరును వివరించారు.

అమ్మానాన్నల ప్రోత్సాహం..

పిల్లలు పరిపూర్ణులుగా ఎదగడంలో చేయిపట్టి నడిపించే ప్రోత్సాహం అవసరం. అది తల్లిదండ్రులు, గురువులు, బంధువులు, స్నేహితులు ఎవరైనా కావచ్చు. నా ఎదుగదలలో అమ్మానాన్నలు సత్యవేణి, రాజుల సహకారం చాలా ఉంది. నేను ఎంచుకున్న లక్ష్యం కోసం అడుగడుగునా ప్రోత్సహించారు. మా స్వస్థలం కాకినాడ జిల్లా కిర్లంపూడి. తునిలో కొన్నాళ్లు చదివాను. చిన్నతనంలో ఇంజినీరు కావాలనే లక్ష్యం ఉండేది. తర్వాత డీఎస్సీ రాసి ఉపాధ్యాయునిగా విధుల్లో చేరా. సివిల్స్ ర్యాంకర్ల విజయగాథలు.. ఆ ఉద్యోగంలో ప్రజలకు ఇంకా మెరుగైన సేవ చేయవచ్చన్న ఆలోచన నన్ను అటుగా నడిపించింది. అనేక ఉద్యోగాలు చేస్తూనే గ్రూప్–1కు సిద్ధమయ్యా. రాష్ట్రస్థాయిలో 13వ ర్యాంకుతో డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికయ్యాను. ఆ తర్వాత అంచెలంచెలుగా ఎదిగి, ఇప్పుడు జిల్లా కలెక్టర్‌గా ప్రజలకు సేవ చేసే మంచి అవకాశం వచ్చింది.



చదువు ప్రణాళికపై విద్యార్థులకు దిశానిర్దేశం చేస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ (ఫైల్)

ప్రణాళికతో ముందుకు వెళ్తే విజయం తథ్యం

చిన్న నాటి నుంచి తెలుగు మాధ్యమంలోనే చదువు సాగింది. గ్రంథాలయాల్లో చదివి గ్రూప్స్ సాధించాను. అప్పటితో పోల్చుకుంటే నేడు విద్యావకాశాలు మెరుగయ్యాయి. ప్రభుత్వాలు అండగా నిలుస్తూ, విద్యకు ప్రోత్సాహం అందిస్తున్నాయి. లక్ష్యసాధనలో సవాళ్లు ఎదురైనా.. గమ్యం చేరే వరకు విశ్రమించకుండా ప్రయత్నం సాగాలి. అడ్డంకులను అవకాశాలుగా మలుచుకోవడంలోనే విజయం ఉంటుందని నేటి బాలలకు కలెక్టర్ సూచించారు.



పిల్లలకు స్వేచ్ఛ ఇస్తే.. అనుకున్నది సాధిస్తారు

నాకు ఊహ తెలిసి, రెండో తరగతి చదువుతున్న సమయంలోనే కలెక్టర్ కావాలన్న ఆశయం తనలో కలిగిందని మన సంయుక్త కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక చెప్పారు. పదో తరగతిలో తల్లిదండ్రులు మరోసారి అడిగితే.. అదే చెప్పానని, నాటి నుంచి తన లక్ష్యం కోసం ఎంతో శ్రమించానని, పుస్తకాలతో స్నేహం చేసినట్టు తెలిపారు. పిల్లలందరూ అందమైన బాల్యపు మధుర అనుభవాలను ఆనందిస్తూనే, గమ్యస్థానం చేరేందుకు నిరంతర సాధన చేయాలని సూచించారు. తన లక్ష్య సాధనలో వెన్నంటి నడిపించి.. మంచి జీవితం రావడంలో తోడ్పాటునిచ్చిన అమ్మానాన్నలు షణ్ముగ వడివు, సెల్వం మురుగన్‌లకు జీవితాంతం రుణపడి ఉంటానని చెప్పారు.

ఎన్నో ఏళ్లు ఇంటికి దూరమయ్యా..

మాది తమిళనాడు రాష్ట్రంలోని సెల్వం జిల్లా. చిన్నతనం నుంచి ఐఏఎస్ కావాలన్న లక్ష్యం ఉండేది. కాలేజీ చదువులు పూర్తి కాగానే.. ఇంటికి దూరమై, చెన్నై వెళ్లి సివిల్స్ శిక్షణ పొందా. అమ్మానాన్నలతో పాటు, సోదరి (ప్రస్తుతం యూఎస్‌లో స్థిరపడ్డారు) ప్రేమకు దూరమయ్యానన్న బాధ ఉన్నా.. ఆశయం కోసం కొన్ని త్యాగాలు చేయాల్సిందే కదా. తల్లిదండ్రులిద్దరూ ప్రభుత్వ ఉద్యోగులే కావడంతో నన్ను మరింత ప్రోత్సహించారు. నాకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. మనల్ని నమ్మి, వారు ఇచ్చిన స్వేచ్ఛను మనమెప్పుడూ దుర్వినియోగం చేయకూడదు. ఎవరి మీదా ఆధారపడకుండా అమ్మాయిలైనా స్వతంత్రంగా మంచి స్థానంలో ఉండాలన్నది నా భావన. ఐఏఎస్ సాధనలో దాదాపు నాలుగేళ్లు చిన్నచిన్న సంతోషాలు కూడా వదిలేశా. ఆ కాలంలో ఒక్క సినిమా కూడా చూడలేదు. అదొక మూడు గంటల సమయం వృథా అవుతుందనే అప్పట్లో ఆలోచించా.



చిన్నతనంలో మన జేసీ శోభిక

మన గమ్యమేమిటో ముందే గుర్తించాలి..

బాల్యంలో చాలా అవకాశాలుంటాయి. మన జీవితంలో ఏం కావాలనుకుంటున్నామో అన్న నిర్ణయాన్ని చిన్నతనంలోనే నిర్దేశించుకోవాలి. అందరికీ సమస్యలుంటాయి. అందరి జీవితాలూ ఒకేలా ఉండవు. చేరాలనుకున్న లక్ష్యం కోసం ఎన్ని ఆటంకాలు ఎదురైనా భరించాలి. మన ప్రయత్నాన్ని కొనసాగించాలి. ఏదో ఒక రోజు కచ్చితంగా గమ్యం చేరుతామని రేపటి తరానికి జేసీ శోభిక సూచించారు.



పాఠశాల విద్యార్థులకు దిశానిర్దేశం చేస్తున్న సంయుక్త కలెక్టర్ శోభిక (ఫైల్)



అమెరికాలో ఏపీ విద్యా పథకాలను వివరిస్తున్న మనస్విని(ఫైల్)

చదువే సర్వస్వంగా...

గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రస్తుతం పదోతరగతి చదువుతున్న సామల మనస్వినికి చదువే సర్వస్వం. ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ చదువులో రాణిస్తోంది. ఆ చదువే గత ప్రభుత్వ హయాంలో అమెరికాలోని కొలంబియా యూనివర్సిటీ సందర్శనకు బాటలు వేసింది. రాష్ట్రంలో ప్రభుత్వ బడుల్లో అమలవుతున్న ఇంగ్లిష్ మీడియం, డిజిటల్ విద్యావిధానాలను బోధించేందుకు అవకాశం కల్పించింది. చక్కగా చదువుకుని.. తల్లిదండ్రుల కష్టానికి ఫలితం ఇద్దామని తోటి విద్యార్థులకు ఈ చిన్నారి బోధిస్తోంది. పిల్లల దినోత్సవాన్ని పండగలా జరుపుకుంటామని సెలవిచ్చింది.

జీవితం సంతోషమయం కావాలి



ప్రతి ఒక్కరి జీవితం సంతోషమయం కావాలి. దీనికి బాల్యంలోనే గట్టిపునాది పడాలి. చిన్నతనంలో బాలల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకునేవాళ్లం. ప్రాథమిక విద్యను ప్రభుత్వ పాఠశాలలో, హైస్కూల్ విద్యను జవహర్ నవోదయలో అభ్యసించాను. నెహ్రూ జయంతి రోజు ప్రతీ చిన్నారి సంతోషంగా గడపాలని ఉపాధ్యాయులు ఉద్బోధించేవారు. వారు చెప్పిన సూచనలు, సలహాలు పాటించడం వల్లే ఈ స్థాయికి చేరుకున్నాను. గురువుల మాట వేదవాక్కుగా భావించాలి. అప్పుడే బాగుపడతాం. చిన్నప్పటి నుంచి సామాజిక చైతన్యం, ప్రశ్నించేతత్వం వంటివి అలవర్చుకుంటే ఉన్నతస్థాయికి ఎదగవచ్చు. పుస్తక పఠనం తప్పనిసరి. స్వాతంత్ర్య సమరయోధుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలి.

– సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి, ఐటీడీఏ పీఓ, సీతంపేట

• మీమేమి చేశాము పాపం..!




చిత్రంలో కనిపిస్తున్న వృద్ధులు, దివ్యాంగులది బలిజిపేట మండలంలోని నారన్నాయుడువలస. రాజకీయ కక్షసాధింపుల్లో భాగంగా కంది గౌరీశంకరరావు, చల్లా పాపమ్మ, బోను సింహాచలం, లండ సింహాచలం, నాగళ్ల అప్పుడు, చిన్ని అప్పలనరసయ్య తదితరుల పింఛన్లు రద్దుచేశారు. ఏళ్ల తరబడి పింఛన్ డబ్బులే ఆధారంగా జీవిస్తున్న వీరంతా ఆందోళన చెందుతున్నారు. మేమేమి చేశాము పాపం అంటూ బలిజిపేట ఎంపీడీఓ కార్యాలయం వద్ద బుధవారం ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మన్మథరావుతో కలిసి ఆందోళన చేశారు. అనంతరం ఎంపీడీఓ విజయలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. తమ గోడు వినిపించారు. పింఛన్లు పునరుద్ధరించి బతుకు భరోసా కల్పించాలని వేడుకున్నారు. కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ స్పందించి పింఛన్లు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

– బలిజిపేట

మన్యంలో మరణ మృదంగం

సాలూరు రూరల్: ఏజెన్సీలో విద్యార్థుల మరణాలకు అడ్డుకట్టపడడం లేదు. డెంగీ, మలేరియా, వైరల్ ఫీవర్‌తో పాటు వివిధ ఆరోగ్య సమస్యలతో మృతి చెందుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల కాలంలో ఏడుగురు విద్యార్థులు మృతి చెందడంతో తల్లిదండ్రులను శోకసంద్రంలో ముంచిపోయారు. తాజాగా మంగళవారం ఉదయం సాలూరు మండలం సారిక పంచాయతీ పరిధి నేరేడువలస గ్రామానికి చెందిన మేముల రామక్రిష్ణ (7) అలియాస్ చంటి ఫిట్స్‌తో మృతి చెందాడు. గత రెండు రోజులుగా జ్వరం, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడని, ఒక్కసారిగా ఫిట్స్ రావడంతో చనిపోయినట్టు తల్లిదండ్రులు కన్నయ్య, శ్రావ్య తెలిపారు. చిన్నారి సంపంగి పాడు పంచాయతీ సుల్లారి జీపీయస్ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. కళ్లముందే చిన్నారి మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. నేరేడువలసలో మరో పదిమంది పిల్లలు జ్వరాలు, విరేచనాలతో బాధపడుతున్నారని, వైద్యాధికారులు స్పందించి వైద్యసేవలు అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు. సరైన దారిలేకపోవడంతో ఆపదవేళ తోణాం పీహెచ్‌సీకి చిన్నారులను తీసుకెళ్లేందుకు వ్యయప్రయాసలుకోర్చాల్సి వస్తోందన్నారు.



మృతిచెందిన గిరిజన విద్యార్థి వేముల రామకృష్ణ



జ్వరంతో బాధపడుతున్న పిల్లలు

పిల్లల్లో న్యుమోనియా నియంత్రణకు 'సాస్'




సాస్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ విజయపార్వతి

పార్వతీపురంటౌన్: పిల్లల్లో న్యుమోనియా లక్షణాలను గుర్తించి, నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విజయపార్వతి సూచించారు. శ్వాస సంబంధిత సమస్యలను పిల్లల్లో గుర్తించే సర్వేకు సంబంధించిన సాస్ కార్యక్రమాన్ని జిల్లా ఆరోగ్య కార్యాలయం ప్రాంగణంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లల్లో సంభవించే ప్రాణాంతకమైన వ్యాధుల్లో న్యుమోనియా తీవ్రమైనదని, వ్యాధిని దాని లక్షణాల ద్వారా సులభంగా గుర్తించవచ్చని తెలిపారు. పిల్లల్లో న్యుమోనియా తదితర శ్వాస సంబంధిత సమస్యల నియంత్రణకు వైద్యారోగ్య శాఖ సాస్ ప్రోగ్రాం ప్రవేశపెట్టిందని, ఇప్పటి నుంచి వచ్చే ఫిబ్రవరి నెలాఖరు వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని, వైద్యసిబ్బంది సర్వే చేసి న్యుమోనియా లక్షణాలున్న పిల్లలను సత్వరమే గుర్తించి తగు చికిత్స అందజేయాలని కోరారు.

వ్యాధి లక్షణాలైన జలుబు, దగ్గు అధికంగా ఉండడం, శ్వాస త్వరత్వరగా తీసుకోవడం, శ్వాస తీసుకునే సమయంలో పక్కటెముకలు కదలడం, అధిక జ్వరం, ఏమీ తినకపోవడం, తాగకపోవడం, అధిక నిద్రమత్తు ఉండడం ద్వారా వ్యాధిని గుర్తించాలని సూచించారు. వాతావరణ మార్పులు, వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉండడం, పోషకాహారం సరిగా తీసుకోకపోవడం, పొగ దగ్గర ఎక్కువ సేపు ఉండడం ద్వారా వ్యాధి తీవ్రమవుతుందని తెలిపారు. వైద్య, అంగన్వాడీ సిబ్బంది సమన్వయంతో పనిచేసి పిల్లల్లో న్యూమోనియా నివారణ చర్యలు చేపట్టి ఆరోగ్యవంతమైన బాల్యాన్ని అందజేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎం.నారాయణరావు మాట్లాడుతూ పీసీవీ వ్యాక్సిన్ మూడు డోసులు షెడ్యూల్ ప్రకారం తప్పనిసరిగా పిల్లలకు వేయాలని, అది న్యూమోనియా నియంత్రణలో కీలకమైందని సూచించారు. సర్వే నివేదికలను సంబంధిత సాస్ యాప్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి. జగన్మోహన్‌రావు, డా ఎం.వినోద్, డా పి.శ్రీధర్, డీపీహెచ్ఎన్ఓ. ఉషారాణి, డెమోలు యోగీశ్వరరెడ్డి, సన్యాసిరావు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


నేటి నుంచి సహకార వారోత్సవాలు

పార్వతీపురం: సహకార సంఘాల బలోపేతానికి సహకార వారోత్సవాలు దోహదపడతాయని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో 71వ భారత సహకార వారోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆయన బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన, మెరుగైన ప్రపంచ నిర్మాణంలో సహకార సంఘాల పాత్ర కీలకమన్నారు. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు సహకార వారోత్సవాలు నిర్వహిస్తామని చెప్పారు. ప్రధానమంత్రి జన ఔషధి కింద జిల్లాలో జనరిక్ మందుల విక్రయ కేంద్రాలను ప్రారంభించినట్టు వెల్లడించారు. మూడు పెట్రోల్ బంకుల నిర్వహణను సహకార సంఘాలకు అప్పగించామన్నారు. 14న సహకార సంఘాల పరిధిలో అమలుచేస్తున్న నూతన కార్యక్రమాలను వివరించడం, 15న నూతన ఆవిష్కరణలు, సాంకేతిక సుపరిపాలన, 16న వ్యవస్థాపకత, ఉపాధికల్పన, నైపుణ్యాభివృద్ధిలో సహకార సంఘాల పాత్ర, 17న సహకార సంస్థల వ్యాపార ప్రాయోజిత సంస్థలుగా రూపాంతరం, 18న సహకార సంఘాల మధ్య సహకారాన్ని పెంపొందించడం, 19న మహిళలు, యువత, బలహీన వర్గాలకు సహకారం అందించడంలో సహకార సంఘాల పాత్ర, 20న సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో సహకార సంఘాల పాత్ర వంటి అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి పి.శ్రీరామూర్తి, జి.ప్రణాళికాధికారి పి.వీరరాజు, సహకార సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, తదితరులు

ఇసుక తవ్వకాల్లో నిబంధనలు పాటించాలి



నిబంధనలు అనుసరించాలని స్పష్టం చేస్తున్న సబ్ కలెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డి

పాలకొండ రూరల్: ఉచిత ఇసుక తవ్వకాలు, తరలింపునకు నిబంధనలు పాటించాలని పాలకొండ సబ్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి ట్రాక్టర్ల డ్రైవర్లు, ప్రజాప్రతినిధులకు స్పష్టం చేశారు. స్థానిక అవసరాల పేరిట అనుమతులు లేనిచోట ఇసుక తవ్వకాలు చేపడుతున్నట్టు వచ్చిన ఫిర్యాదులపై ఆయన స్పందించారు. పలు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నారు. దీంతో ట్రాక్టర్ యజమానులు, ప్రజాప్రతినిధులు బుధవారం ఆయన కార్యాలయం వద్దకు చేరుకుని సమస్యను వివరించారు. వీటిపై సబ్ కలెక్టర్ స్పందిస్తూ అన్నవరం, గోపాలపురం, మంగళాపురం ప్రాంతాల్లో నిబంధనల ప్రకారం ఇసుక తవ్వకాలు చేపట్టాలన్నారు. తొలుత ఆయా పంచాయతీల పరిధిలోని సచివాయాల వద్ద ఇసుక కోసం నమోదు చేసుకోవాలన్నారు. అక్కడి సిబ్బంది నుంచి అనుమతి పత్రం పొందిన 24 గంటల వ్యవధిలో ఇసుకను ట్రాక్టర్‌కు లోడ్ చేయాలన్నారు.